క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన అధికారులు



సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపిస్తున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

ప్రత్తిపాడు/రౌతులపూడి/జగ్గంపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధులను బహిష్కరించి కేంద్రాలకు తాళాలు వేసి ఆందోళనలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేయడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంపీఆర్ కుమార్ బాబు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచారు. మహిళా సంఘ సభ్యులతో చిన్నారులకు ఆహారం వండి, వడ్డిస్తున్నట్టు ఎంపీడీఓ కుమార్ బాబు తెలిపారు.

అంగన్‌వాడీల దీక్ష

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక వీరవరపుపేట సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని కొత్త సూరవరం, కోర్టు వీధి, బ్యాంకు కాలనీ, బత్తాయితోట వీధి, సమితి ఆఫీసు, దుర్గాదాస్ వీధి, రెడ్ కాన్వెంట్, స్వప్న లాడ్జి, కొత్తపేట, శాంతినగర్, సినిమా రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ సూచించారు. మండలంలోని గోవిందపురంలో గురువారం ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ కౌశల్ యోజన, రేషన్ పంపిణీ, మాతృత్వ సురక్ష యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా 'అలమండ'



అలమండ వీరరాఘవస్వామి

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా ఏలేశ్వరం పట్టణానికి చెందిన అలమండ వీరరాఘవస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక ఉత్వర్వులు అందినట్టు గురువారం వీరరాఘవస్వామి తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వీరరాఘవ స్వామికి పలువులు అభినందనలు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: శంఖవరం మండలం వజ్రకూటంలో సారా స్థావరాలపై ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్ - ఎస్‌ఈబీ) సిబ్బంది గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడు పిల్లా శ్రీనుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. అనంతరం గ్రామంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోటనందూరు: అక్రమంగా నిల్వ చేసిన 1500 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌బాబు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇందుగపల్లికి చెందిన లౌడు శివ ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేశాడనే ముందస్తు సమాచారంతో విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, సివిల్ సప్లయి డీటీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం నిర్వాసితులు గురువారం గోకవరంలో నిరసన దీక్ష చేపట్టారు. దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన పలువురు నిర్వాసితులు గ్రామ సర్పంచ్ కుంజం రాజమణి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ దీక్షకు మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై త్వరలో రంపచోడవరం ఐటీడీఏ పీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తామని తెలిపారు.

సస్యరక్షణ.. నష్ట నివారణ

- భారీ వర్షాలకు నీట మునిగిన ఉద్యాన పంటలు
- సంరక్షణ చర్యలు చేపట్టిన అన్నదాతలు
- 40 వేల ఎకరాల తోట పంటల సాగు



తాళ్లూరులో నీట మునిగిన టమాటా పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి



కొలిమేరులో ముంపులో ఉన్న అరటి, కొబ్బరి తోటలు

తుని రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్‌లోని వేలాది ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయల పంటలు నీట మునిగాయి. రోజుల తరబడి ముంపులో ఉండడంతో కూరగాయలు, పూల తోటలు, అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు సస్యరక్షణ చర్యల్లో బిజీగా ఉన్నారు.

తుని సబ్ డివిజన్ పరిధిలో...

ఉద్యాన శాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో మామిడి, జీడి మామిడి, జామ, అరటి, బొప్పాయి, ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో, నిమ్మ, బత్తాయి, పూల తోటలు, కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో ముంపునకు గురైన పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

పొలాల్లో నీటిని తీసివేయాలి

నీట మునిగిన ఉద్యాన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానశాఖ అధికారి జి.విజయలక్ష్మి వివరించారు. కూరగాయలు, ఉద్యాన పంట పొలాల్లో నిలిచిపోయిన నీటిని సాధ్యమైనంత త్వరగా తీసి వేయాలి. అంతర సేద్యం చేపట్టి కలుపు తొలగించడమే కాకుండా నేల తడి ఆరేటట్టు చూసుకోవాలి. డీఏపీ, యూరియా వంటి పోషకాలను పంటకు వేయాలి. పొలంలో నీరు నిలవడం వల్ల ఎండు తెగులు సోకే ప్రమాదం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా మెటలాక్సిల్, మాంకోజెట్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఆకు మచ్చ, బూజు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బెండిజం ఒక గ్రాము లేదా మాంకోజెడ్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూజు తెగులు నివారణకు థైమిథోమర్ఫ్ 1.5 గ్రాములు లేదా మెటలాక్సిల్, మాంకోజెట్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

> **మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు**
>
> మామిడి, జీడిమామిడి, జామ, నిమ్మ, బత్తాయి, అరటి, పూలతోటలు, కొబ్బరి, కోకో, ఆయిల్ పామ్ పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించే అవకాశం ఉంది. తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి ఆయా మండలాల ఉద్యాన అధికారులను, గ్రామాల్లో వీహెచ్ఏలను సంప్రదించాలి. ఆయా అధికారుల సలహాలు, సూచనలను రైతులు పాటించడం ద్వారా ఉద్యాన పంటలను కాపాడుకోవచ్చు. పండ్లు, పూల తోటల ఫలసాయం సేకరణలో మెళకువలు పాటించాలి. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి.
>
> – జి.విజయలక్ష్మి, హెచ్ఓ, తుని

ఘనంగా కలశ ప్రతిష్ఠ



జగపతినగరం సాయి బాబా ఆలయంలో కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం జగపతినగరంలోని సాయిబాబా ఆలయంలో గురువారం కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు గోవర్ధనం అంజిబాబు ఆధ్వర్యాన శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన గౌతు వెంకటేష్ నాయుడు కలశ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, ఆలయ కమిటీ సభ్యులు నక్కా అప్పలరాజు, రమణ, పాముల చంటి, బొడ్డేటి అప్పారావు, పెంటకోట నల్లబాబు, గంధం మల్లయ్య, యల్లపు శివ, మదీనా భాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నదానం

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో గత 42 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదానం గురువారంతో ముగిసింది. గ్రామపెద్దలు, దాతల సహకారంతో గురుస్వామి సిద్దా నానాజీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ 300 మందికి అయ్యప్ప, భవానీ మాలధారులకు అన్నదానం చేశారు.

కేంద్ర బృందం పర్యటన



కాకరాపల్లిలో మొలకెత్తిన వరి పనలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కోటనందూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు మండలంలో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. పౌరసరఫరాల శాఖ రిటైర్డ్ మేనేజర్ జోగారావు ఆధ్వర్యంలో కాకరాపల్లి, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు, అల్లిపూడి గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. కుప్పలపై తడిచిన, పొలాల్లో పనలపై తడిచి మొలకెత్తిన, నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. తుపాను ప్రభావం, జరిగిన పంట నష్టంపై రైతులతో చర్చించారు. పలు ప్రాంతాల నుంచి ధాన్యం నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, ఏఓ చంద్రశేఖర్, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న వరి పంటలను కేంద్ర బృందం గురువారం పరిశీలించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి జోగారావు, సివిల్ సప్లయి అధికారి విజయ్‌కుమార్, కిషోర్, డీఎస్ఓ విజయ్ తదితర సభ్యులతో కూడిన అధికారుల బృందం ఎ.కొత్తపల్లి, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం, ఏవీ నగరం తదితర గ్రామాల్లో పర్యటించింది. పనలపై తడిసి కుళ్లిపోయిన వరి పనలు, కళ్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. వారి వెంట తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, ఆర్ఐ వెంకటేశ్వరరావు, ఏఈఓ కొప్పన దైవప్రసాద్, వీఆర్వోలు, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.



తంటికొండలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

రంగుమారిన ధాన్యాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

గోకవరం: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిపోయి రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని తంటికొండ, గాదెలపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి కేంద్రం బృందం పర్యటించింది. బృంద సభ్యులు కళ్లాల్లో ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం నమూనాలను వారి వెంట తీసుకువెళ్లారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి, సిబ్బంది భాస్కర్, స్వాతి, ప్రవీణ్, గాదెలపాలెం ఎంపీటీసీ సభ్యుడు గళ్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి



కోటనందూరులో దళిత మహిళకు సంపూర్ణ భూహక్కు పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: దళితుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ కె.కుశరాజు ఆధ్వర్యంలో 147 మంది దళితులకు వైఎస్సార్ సంపూర్ణ దళిత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, ఉప సర్పంచ్ బొంగు గోపాలకృష్ణలతో కలిసి ఎంపీపీ భూ హక్కు పత్రాలు అందజేశారు. మండలంలోని పాతకొట్టాం, ఎస్సార్ పేట, బిళ్లనందూరు గ్రామాలకు చెందిన 147 మంది దళితులకు 1992లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు చేసి ఒక్కొక్క లబ్ధిదారుడికి 50 సెంట్ల చొప్పున భూమి పంపిణీ చేశారు. ఈ భూములపై మార్టుగేజ్ తనకా పేరిట రుణం సైతం అందజేశారు. దివంగత మహానేత వైఎస్సార్ 2004లో దళితులు తీసుకున్న రుణాలను మాఫీ చేసినప్పటికీ పట్టాలను తిరిగి వారికి అప్పగించలేదు. ప్రస్తుతం మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు దళితులకు భూహక్కు పత్రాలు అందజేశారు. సాగుభూమిపై పూర్తి హక్కులు పొందిన దళితులకు పట్టాలు సైతం అందజేస్తామని తహసీల్దార్ కుశరాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సుర్ల రాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు



ఎస్.అన్నవరంలో ధనుర్మాస ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో అర్చకులు పందిరి రాట వేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నెల రోజులు జరిగే ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న రాత్రి 1.03 గంటలకు నెలగంట పూజ, రక్షాబంధనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 23న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. 26న పౌర్ణమి సందర్భంగా సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తారు. జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో పుల్లంగి సేవ, శ్రీపుష్పయాగం, 4న గోదాదేవి అమ్మవారికి సహస్ర దీపాలంకార సేవ, 5న తిరుప్పావడి సేవ, అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. 9న స్వామివారికి పంచహారతుల సమర్పణ, 12న కూడరై ఉత్సవం, 13న అమ్మవారి సారే ఊరేగింపు, మంగళస్నానం, 14న బోగి పండగ, సాయంత్రం 7 గంటలకు గోదారంగనాథుల దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

'ఆడుదాం.. ఆంధ్రా'లో భాగస్వాములు కండి



ప్రత్తిపాడులో కార్యదర్శులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడా పోటీల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పిలుపు నిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ సచివాలయ కార్యదర్శులకు క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఆడుదాం..ఆంధ్రా' క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. కబడ్డీ, వాలీబాల్ క్రికెట్, ఖోఖో తదితర పోటీల్లో 15 ఏళ్ల పైబడిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ఈఓఆర్డీ కె.కాశీవిశ్వనాథం, ఫిజికల్ డైరెక్టర్ దేవీ కుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు వాయిదా

ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. మిచాంగ్ తుపాన్ నష్టాలను అంచనా వేసే పనిలో సిబ్బంది నిమగ్నమైనందున, రానున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 15 నుంచి జరగవలసిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సంబరాలను ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీహోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం ×మూల¥ సందర్భంగా గురువారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్ ఘనాపాఠి, కంచిబట్ల సాయిరామ్, యడవిల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్, చల్లపిళ్ల ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



తునిలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

తుని: కాకినాడలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము పిలుపునిచ్చారు. స్థానిక రాజా కళాశాల ఆవరణలో గురువారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులను చైతన్యపరచడం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం, అందరికీ నాణ్యమైన విద్య, నాణ్యమైన ఉపాధి సాధించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వీరబాబు, అహ్మద్, కరీం, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి సారె సమర్పణ



జగపతినగరంలో గౌరీదేవికి సారె తీసుకువెళుతున్న మహిళలు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం జగపతినగరంలో గౌరీదేవి అమ్మవారికి సారె సమర్పణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. గౌరీదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కర్రి సూర్యకుమార్, ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మహిళలు, యువతులు తమ ఇళ్లలో వండిన పలురకాల వంటకాలు, మిఠాయిలు, పండ్లు తదితర నైవేద్యాలను శిరస్సున దాల్చి, సారెతో శోభాయాత్ర (గ్రామోత్సవం) నిర్వహించారు. జగపతినగరం, కొండయ్యపేట, కొత్త కాలనీ, యల్లపు వారి వీధి, సోమరాజుపేట, మెయిన్‌రోడ్డు మీదుగా కిర్లంపూడి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వరకూ ఈ యాత్ర కొనసాగింది. మహిళలు తిరిగి జగపతినగరం గౌరీదేవి అమ్మవారికి ఆలయానికి చేరుకుని, నైవేద్యాలను సమర్పించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వేర్వేరుగా అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. యంగ్‌మెన్స్ క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలత, చదరం చంటిబాబు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపాల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మెప్మా మార్కెట్ ద్వారా విక్రయిస్తారన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ సాయికుమార్, ఆర్పీలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



అచ్చంపేటలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని అచ్చంపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సౌమ్యశ్రీ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. 60 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందిచామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం



తొండంగిలో డిజిటల్ బోర్డును ప్రదర్శిస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు

తొండంగి: రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డులను పార్టీ నాయకులతో కలిసి వైస్ ఎంపీపీ గంగబాబు ఆవిష్కరించారు. మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబురాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, అంగుహరి సుశీలారాణి, దడాల విజయ్, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి ఆంజనేయులు, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, సర్పంచ్ సోమాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ జగనే రావాలి

అన్నవరం: రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలని శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. అన్నవరం సచివాలయం-3 పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఎంపీపీ రాజబాబు ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, కొండపల్లి అప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



బలరామపురంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రౌతులపూడి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను అన్నారు. మండలంలోని బలరామపురంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ నాయకుడు అచ్చిర్తి సాంబ, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

కోటనందూరు: దివ్యాంగ చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని నాన్ భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతి వారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలతో పాటు, నాణ్యమైన ఆహారం, డిజిటల్ విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ శ్రీనివాసు ఆర్థిక సహాయంతో దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఏఎంసీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, ఎంపీడీఓ శర్మ, ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, ఐసీడీఎస్ కమల కుమారి, ఐఈఆర్పీ నాగగోవిందు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంతోనే వ్యాధుల నివారణ

గండేపల్లి: ప్రకృతి వైద్యంతోనే వ్యాధుల సమూల నివారణ సాధ్యమని గోవిందపురానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు గొట్టిముక్కల వెంకటపల్లి సుబ్బరాజు (నాని) తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో ఆయుర్వేద హెర్బల్ షాపును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ పూర్వీకుల నుంచి గత ఏడు తరాలుగా ఈ ఆయుర్వేద వైద్యం చేస్తున్నామన్నారు. వ్యాధుల నివారణకు ఆయుర్వేదం ఎంతో మేలన్నారు. ప్రజలు ఈ ఆయుర్వేద షాపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం పాల్గొన్నారు.